# బహుజనుల సాధికారతకు ప్రతీక పూలే

- అసెంబ్లీలో విగ్రహం పెట్టాల్సిందే
- పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు
- పలుచోట్ల ప్రజల శ్రద్ధాంజలి
- ఎమ్మెల్సీ కవిత పోరాటానికి సీపీఎం నేతల మద్దతు



జ్యోతిరావుపూలే 198వ జయంతిని పురస్కరించుకొని కార్వాన్ బీసీ ఐక్య వేదిక అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావనీర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, బీఆర్ఎస్ నేత గట్టు రామచంద్రరావు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం ఎమ్మెల్సీ కవిత అన్ని పార్టీలు, ప్రజాసంఘాల మద్దతును సమీకరిస్తున్నారు. అందులోభాగంగా ఆమె శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసి తన పోరాటానికి సీపీఎం మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బహుజనుల సాధికారతకు ప్రతీకగా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అడ్డంకి తొలగిపోయిందని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుతో తొమ్మిది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు. అందువల్ల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని కోరారు. తక్షణమే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పూలే విగ్రహాన్ని అసెంబ్లీ అవరణలో ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదన అభినందనీయమని అన్నారు. ఈ విషయంలో ఆమెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. కుల అసమానతలను నిర్మూలించకుండా దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లదన్నది సీపీఎం నమ్మకమని స్పష్టం చేశారు. కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిందేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలను బహిర్గతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రప్రభుత్వాన్ని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

### పూలే బాటలో నడవాలి


కార్వాన్ : బీసీల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పూలే 198వ జయంతిని పురస్కరించుకొని నగరంలోని మింట్ కాంపౌండ్, శారదానగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజహితం కోసం పనిచేసిన పూలేను ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో అందరూ నడవాలని అన్నారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ప్రతిష్ఠించేంత వరకు ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని చెప్పారు. ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామంటున్నదని, దీనిని తాము స్వాగతిస్తున్నామని అయితే అసెంబ్లీ ఆవరణలో కూడా పెట్టాలని డిమాండ్ చేశారు.

### జాజుల శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యలపై ఉద్రిక్తత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్‌లో వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవితను లక్ష్యంగా చేసుకుని బీసీ సంఘాల నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్న కార్యక్రమంలో జాజుల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలకు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అభ్యంతరం చెప్పారు. కవిత మీద అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. వెంటనే సభలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జాజుల శ్రీనివాస్ వ్యాఖ్యలను ఖండించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరగా సభాధ్యక్షుడు చిన్న శ్రీశైలంయాదవ్ నిరాకరించారు. స్థానిక కార్పొరేటర్‌కు మైక్ ఇవ్వకపోవడంపై కొంత గందరగోళం నెలకొంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పూలే విగ్రహాన్ని ఫిలింనగర్‌లో ప్రతిష్ఠించాలని కష్టపడిన తమకు కాంగ్రెస్ పార్టీ నేతలు బీసీ సంఘాల ముసుగులో అవమానపరుస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సభను ముగించి, నిర్వాహకులు వెళ్లిపోయారు. కాగా ఎమ్మెల్సీ కవిత మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మీద చర్యలు తీసుకోవాలంటూ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, జాగృతి కార్యకర్తలు, యునైటెడ్ పూలే ఫ్రంట్ నేతలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాజుల శ్రీనివాస్ కవితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# గో బ్యాక్ కాంగ్రెస్

- ఆదిలాబాద్ జిల్లా దేగామలో కాంగ్రెస్ నాయకుల నిలదీత
- ఇందిరమ్మ ఇండ్లు వద్దు.. ముంపు సమస్య పరిష్కరించాలని డిమాండ్



ఆదిలాబాద్ జిల్లా దేగామలో కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్న ముంపు బాధితులు

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 11 : 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' పేరుతో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామంలో కాంగ్రెస్ నాయకులను నిరసన సెగ తగిలింది. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆడే గజేంధర్‌తోపాటు నాయకులను దేగామ గ్రామంలోని పాత కాలనీవాసులైన ముంపుబాధితులు అడ్డుకున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామంలోని చెరువు నిండి ఇండ్లల్లోకి వరద చేరుతున్నదని తెలిపారు. మురుగునీరు, దుర్వాసన, పాములు, తేళ్లతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లు తమకు వద్దని, ముంపు సమస్య పరిష్కరించి 130 కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



కుల వివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు జ్యోతిరావు పూలే అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ వీహెచ్‌తో కలిసి సీఎం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే జీవితం ప్రతీఒక్కరికి స్ఫూర్తిదాయకమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఉద్యోగ సంఘాలతో చర్చలు వాయిదా!

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : 'ఫొటోల కోసమైతే మేం చర్చలకు రాం.. మా డిమాండ్లపై ఏదో ఒకటి తేల్చుతామంటేనే చర్చలు' అన్న ఉద్యోగ సంఘాల జేఏసీ హెచ్చరికల నేపథ్యంలో జేఏసీతో సర్కారు జరపాల్సిన చర్చలు వాయిదాపడ్డాయి. జేఏసీ నేతల అభ్యంతరాలు, అసంతృప్తులతో శనివారం(ఈ నెల 12న) జరగాల్సిన చర్చలను సర్కారు మొత్తంగా వాయిదా వేసింది. శాఖల నుంచి వివరాలు రాకుండా, హెచ్‌వోడీలు లేకుండా చర్చలు చేస్తే ఏం లాభమని జేఏసీ నేతలు నిలదీసినంత పనిచేశారు. ఇదే విషయంపై 'ఫొటోలు దిగేందుకైతే మేం రాం' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో గురువారం కథనం కూడా ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో చర్చలకు పిలిస్తే అసలుకే మోసం వస్తుందని గ్రహించిన సర్కారు పునరాలోచనలో పడింది. 57 డిమాండ్లపై నోట్‌లను సిద్ధం చేయిస్తున్నది.

# సకాలంలో జీతాలివ్వని సర్కారు!

- ఆర్టీసీలో నాన్‌ఆపరేషన్ ఉద్యోగులకు అందని వేతనం
- ప్రభుత్వం మహాలక్ష్మి నిధులు ఇవ్వడం లేదని వెల్లడి
- మాడల్ స్కూళ్లలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సమయానికి జీతాలు రాక పలు విభాగాల్లో ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు నెలల నుంచి జీతాలు ఎప్పుడు పడుతాయో తెలియడంలేదని ఆర్టీసీ నాన్‌ఆపరేషన్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నెల కూడా 12వ తారీఖు వచ్చినా జీతాలు రాలేదని వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6వేల మంది నాన్‌ఆపరేషన్ ఉద్యోగులు ఉండగా ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లోనే 300 మంది ఉన్నారు. జీతాల కోసం ఆందోళనకు దిగితే మెమోలు జారీ చేస్తామంటూ కొందరు అధికారులు హెచ్చరిస్తున్నారని ఉద్యోగులు విలపిస్తున్నారు.

### మహాలక్ష్మి పథకంపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి ఆర్టీసీ ఎందుకొచ్చిందో ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు ఆలోచించుకోవాలి. ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తే.. అందుకు సంబంధించిన నిధులను ఆర్టీసీకి చెల్లించాలి.

-థామస్‌రెడ్డి, ఆర్టీసీ జేఏసీ నాయకుడు

### జీతాలివ్వకపోతే ఎలా బతికేది!

మాడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా 3 నెలలుగా జీతాలు అందడంలేదు. మాడల్ స్కూళ్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పీడీ, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వీరికి అరకొర జీతం ఇస్తున్నారు. అది కూడా సకాలంలో జీతాలివ్వకపోతే ఎలా అని టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు డిమాండ్ చేశారు.

## 17న 'చలో సెక్రటేరియట్'

### ఉద్యోగ భద్రత కల్పించిన తర్వాతనే రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయాలి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : 'చలో సెక్రటేరియట్'ను విజయవంతం చేయాలని 12 యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ వేదికగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాకతీయ యూనివర్సిటీతోపాటు చాకలి ఐలమ్మ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ యూనివర్సిటీలకు చెందిన పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు సోమేశ్వర్, జానకిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్సిటీల్లో 900 మంది పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారని, జీవో 21 ప్రకారం రెగ్యులర్ అధ్యాపక పోస్టులు భర్తీ చేస్తే తమ ఉద్యోగాలు పోతాయని, తమ కుటుంబాలు రోడ్డుపాలు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. అధ్యాపక నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకులకు ప్రథమ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సర్కారు దిగిరాకపోతే ఈ నెల 17న 'చలో సెక్రటేరియట్'ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రాఫ్ డౌన్

- బీజేపీ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్ రెడ్డి గ్రాఫ్ డౌన్ అయిందని బీజేపీ ఎంపీ అర్వింద్ విమర్శించారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిని మార్చాలని కాంగ్రెస్ హైకమాండ్ చూస్తున్నదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి మోదీని తిడుతుంటే, మంత్రులు మాత్రం సబర్మతి రివర్ ఫ్రంట్ చూసేందుకు 150 మంది జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, మేయర్‌ను తీసుకెళ్తామంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తున్నదని మండిపడ్డారు. హామీలు మరిచి హెచ్‌సీయూ, మూసీ, హైడ్రా, సినిమా వాళ్లపై పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేసి ఢిల్లీకి పంపడం రేవంత్ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.

# 'యంగ్' బడుల్లో లక్షల ఫీజులా!

- ఒకటో తరగతికి రూ.2లక్షలు ఫీజులెందుకు?
- యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఫీజులపై విమర్శలు
- కార్పొరేట్ స్కూల్స్ రెచ్చిపోయేందుకు అవకాశం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై విద్యావేత్తల ఆగ్రహం

**యంగ్ ఇండియా స్కూల్‌లో 1వ తరగతి ఫీజు వివరాలు**

| క్యాటగిరీ | సీట్ల రిజర్వేషన్ | ఏడాది ఫీజు |
|---|---|---|
| 1) పోలీసు అమరవీరుల పిల్లలు | 5% | రూ.40,000 |
| 2) హోంగార్డ్స్ నుంచి ఏఎస్ఐ పిల్లలు | 40% | రూ.50,000 |
| 3) ఎస్ఐ నుంచి డీఎస్పీ పిల్లలు | 40% | రూ.95,000 |
| 4) ఎస్పీ, ఆపై అధికారుల పిల్లలు | 15% | రూ.1,40,000 |
| 5) సాధారణ పౌరుల పిల్లలు | 50% | రూ.1,60,000 |

**ట్రాన్స్‌పోర్ట్ ఫీజు వివరాలు**

| కిలోమీటర్లు | ఫీజు |
|---|---|
| 2 కి.మీ వరకు | రూ.28,000 |
| 2-6 కి.మీ | రూ.30,000 |
| 6-12 కి.మీ | రూ.33,000 |
| 12 పైన కి.మీ | రూ.45,000 |

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ ఫీజులపై తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కార్పొరేట్ స్కూళ్లు వివిధ రకాల ఫీజుల పేరుతో భారీగా వసూళ్లు చేస్తుండగా, ఆ విధానాన్ని ఆమోదించినట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే రేకుల షెడ్డు స్కూళ్లలోనే లక్షల్లో ఫీజులుంటే.. పక్కా భవనాలున్న ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేట్ యాజమాన్యాలు అంతకుమించి ఫీజులు వసూలు చేయరని గ్యారెంటీ ఏంటని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. సర్కారు అనాలోచిత నిర్ణయం విద్యారంగంలో అనేక దుష్పరిణామాలకు దారి తీస్తుందని ఆందోళన చెందుతున్నారు.


### ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకే!!

యంగ్ ఇండియా స్కూల్‌లో సామాన్యుల పిల్లలు చదివే పరిస్థితి లేదని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రైవేట్ స్కూల్ ఫీజులను నియంత్రిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ స్కూళ్లను మించిన ఫీజులు వసూలు చేస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఒకటో తరగతి ఫీజు 2 లక్షల వరకు ఉండటం సరైన పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు.



వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎంకే నాయుడు హోటల్స్ అండ్ కన్వెన్షన్ హాల్‌లో గేట్లు మూసివేయడంతో రోడ్డుపై వేచివున్న నిరుద్యోగ యువత

## • సీఎం ఇలాకాలో భగీరథ కార్మికుల సమ్మె



కొడంగల్, ఏప్రిల్ 11: కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మిషన్ భగీరథ కార్మికులు సీఎం ఇలాకా అయిన కొడంగల్ నియోజకవర్గంలో సమ్మెకు దిగారు. కొడంగల్ శివారులోని మిషన్ భగీరథ పథకం సంప్‌హౌస్ వద్ద కార్మికులు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం తమ ఆవేదనను గుర్తించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వీరి సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్మికుల సమ్మెతో 220 గ్రామాలు తాగునీటి సమస్యను ఎదుర్కోనున్నాయి.

## •'కడా'ను ముట్టడించిన స్వీపర్లు



కొడంగల్, ఏప్రిల్ 11: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల స్వీపర్లు ఆందోళనకు దిగారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని 'కడా' కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన కరువైందని ఆందోళన వ్యక్తంచేశారు. టీఎఫ్‌టీయూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏండ్లుగా పనిచేస్తున్న తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, 61 ఏండ్లు నిండిన స్వీపర్లకు రూ.15 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ అందించాలని డిమాండ్ చేశారు.

## భవిష్యత్ అవసరాలకు తగినట్టు డ్రైపోర్ట్

- ఆర్‌ఆర్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి
- ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు విస్తరణ
- పలు అంశాలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ఆయన పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం..ఆర్‌ఆర్‌ఆర్ పనుల పురోగతిపై సమీక్ష ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్రం పనులపై దృష్టిసారించాలని సూచించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు రూపొందించి ఎన్‌హెచ్‌ఏఐకి పంపించాలని అధికారులకు సూచించారు.

### మెట్రో విస్తరణ దృష్టి పెట్టండి

ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రోను విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో విస్తరణపై జరిగిన సమీక్షలో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉన్నదని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపామని అధికారులు వివరించారు. తాజాగా ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఎం ముఖ్యకార్యదర్శి వీ శేషాద్రి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

### మూసీ పనులను వేగవంతం చేయండి

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బాపూఘాట్ వద్ద నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తోపాటు మీర్‌ఆలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను పరిశీలించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, బ్రిడ్జితోపాటు ఐలాండ్ జోన్ పక్కనే ఉన్న జూపార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు.

# జాబ్ మేళాలో తొక్కిసలాట

- ముగ్గురికి గాయాలు
- ఏర్పాట్లు అధికారుల విఫలం
- ఎండకు నిరుద్యోగుల అవస్థలు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 11 : తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో తొక్కిసలాట జరిగింది. ముగ్గురు యువతకులకు గాయాలయ్యాయి. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధి రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ జంక్షన్‌లోని ఎంకే నాయడు హోటల్స్ అండ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలివచ్చారు. 6 వేల ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందని ప్రకటించడంతో నిరుద్యోగులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆలస్యంగా రావడం, కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రసంగాలు పూర్తయ్యే వరకు నిరుద్యోగులను లోనికి అనుమతించకపోవడంతో హోటల్ ఆవరణ పూర్తిగా నిరుద్యోగులతో నిండిపోయింది. హోటల్ గేట్లు మూసివేశారు. మంత్రులు తమ ప్రసంగాన్ని ముగించుకొని వెళ్లిపోయాక నిరుద్యోగులను లోనికి అనుమతించడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో హోటల్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన భారీ అద్దాలు పగిలిపోయి ముగ్గురు యువతులకు గాయాలయ్యాయి. ఒక్కసారిగా అద్దాలు కిందపడటంతో నిరుద్యోగులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. వెంటనే పోలీసులు వారిని నిలువరించి గాయపడిన యువతులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు.

### జాబ్ నోటిఫికేషన్లు వద్దని నిరుద్యోగులే అంటున్నరు

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన ద్వారా నోటిఫికేషన్లు వస్తూనే ఉన్నాయి. అది ఏ స్థాయికి వెళ్లిందంటే.. ఒకప్పుడు నోటిఫికేషన్లు కావాలని ధర్నా చేసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు నోటిఫికేషన్లు పెద్దఎత్తున రావడంతో.. కొంచెం గ్యాప్ ఇవ్వండని నిరుద్యోగులు అంటున్నారు. నోటిఫికేషన్లు వద్దని నిరుద్యోగులు ఆందోళనలు చేసే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నది.

- రాజీవ్ యువవికాసం ప్రారంభోత్సవం సందర్భంగా గత నెల 18న డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యలివి.
- నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారనడానికి వరంగల్ జాబ్‌మేళానే నిదర్శనం.

# మాజీ సర్పంచ్‌ల అర్ధనగ్న ప్రదర్శన

- ప్రజాభవన్ ఎదుట అంగీలిప్పి నిరసన
- బిల్లులు చెల్లించాలని డిమాండ్
- అరెస్టుచేసి పీఎస్‌కు తరలింపు



హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రజాభవన్ ఎదుట మాజీ సర్పంచ్‌లు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అంగీలు విప్పి ప్రజాభవన్ ఎదుట బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని నినదించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. పెండింగ్ బిల్లుల కోసం నిరసన చేపట్టడం తప్పా? అని ప్రశ్నించారు.